# నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక
APTEL/2013/54506



## రిపోర్టర్స్ కావలెను
నిజాలు నిర్భయంగా రాసే సత్తా ఉండి.. ఎలాంటి భయం.. పక్షపాతం అన్నది లేకుండా ఉన్నది ఉన్నట్లు రాయగలిగే రిపోర్టర్లు కావలెను. మీలో ఈ సత్తా ఉంటే కింది నెంబర్లకు రెజ్యుమో పంపండి.
**95150 34555**
**84979 20544**



ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | గురువారం, 17 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 35 | పేజీలు: 4 | వెల:10/-




ఉన్న ఊర్లో బతుకు లేకనో, అప్పులు తీర్చేందుకో, బతుకుదెరువుకో గల్ఫ్ బాట పడుతున్న తెలంగాణ వాసులు విగత జీవులుగా మారి ఇంటికొస్తున్నారు. ఒక్కసారి దుబాయ్ వెళ్తే బతుకు బాగుపడుతుందని ఆశల పల్లకిలో ఊరేగుతూ విమానమెక్కుతున్న వారు శవాలుగా మారి కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. దుబాయ్ షేక్‌ల వేధింపులు, ఏజెంట్లను నమ్మి దేశం కాని దేశంలో అవస్థల పాలవుతున్న వారు కొందరైతే, చిన్న తప్పుకే అక్కడి కారాగారంలో మగ్గుతూ కుటుంబాలకు దూరమవుతున్న ఎందరో. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వారు ఇంకొందరు. హత్యలకు గురవుతున్న వారు మరికొందరు. తాజాగా ఇద్దరు తెలంగాణ వ్యక్తులు దుబాయ్‌లో పాకిస్థానీ చేతిలో హత్యకు గురికావడం ఆందోళనకు గురిచేస్తోంది.

# ఎడారి మరణశాసనం

- గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణ వాసులు
- తెలంగాణ ఏర్పాటు తర్వాత 1700 మందికిపైగా మృతి
- ప్రతి రెండు రోజులకు ఒకరు మృత్యువాత
- హామీలే తప్ప పట్టించుకోని ప్రభుత్వాలు
- గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న వందలాదిమంది
- తాజాగా పాకిస్థానీ చేతిలో ఇద్దరు దారుణ హత్య
- ఒంటరవుతున్న కుటుంబాలు.. చివరి చూపు కోసం పడిగాపులు

2లో..



## పోలీసుల కృషికి దక్కిన గౌరవమిది

- ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025లో నిలవడం ఆనందంగా ఉంది
- సీఎం రేవంత్ రెడ్డి

02



## పాఠశాల వంటగదిలో విష ప్రయోగం

- 30 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు
- నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వెల్లడి

04



## మమకారం మరిచి.. మానవత్వం మంటగలిపి!

- ఆస్తి పంచలేదని కడచూపు చూడని కుమారుడు
- కన్నకూతురే తండ్రికి కర్మకాండలు

**మహబూబ్‌నగర్, నేటి ప్రస్థానం:** కొడుకు ఉంటే పున్నామి నరకం నుంచి తప్పిస్తాడన్ననమ్మకం ఉండేది. కానీ నేటి ఆధునిక యుగంలో మమకారాలు మరిచిపోతున్నారు. మానవత్వం అన్న మాటకు విలువ లేకుండా చేస్తున్నారు. బంధాలు, బంధుత్వాలన్నవే లేన్నట్లు.. ఆస్తి ఉంటే చాలన్నట్లు వ్యవహరిస్తున్నారు కొందరు. అచ్చం ఇలాంటి ఘటనే మహబూబ్‌నగర్ పద్మావతి కాలనీలో జరిగింది. ఆస్తి సరిగా పంచివ్వలేదన్న కోపంతో ఒక్కగానొక్క కుమారుడు తండ్రి మరణించినా కడ చూపు చూడకపోగా.. అంత్యక్రియలు నిర్వహించనని తేగేసి చెప్పాడు. చివరికి చేసేది లేక కూతురే ఆ తండ్రికి కర్మకాండలు నిర్వహించింది. దీంతో కుమారుడు చేసిన పనికి బంధువులు, మిత్రులు విస్మయం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లికి చెందిన మాణిక్యరావు (80) సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ డిపార్ట్మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించేవాడు. మాణిక్యరావు దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. అందరికి పెండ్లిండ్లు చేశాడు. గతంలోనే భార్య మరణించగా.. తనకున్న ఆస్తిలో సొంత ఊరిలో ఉన్న 15 ఎకరాల వ్యవసాయ పొలం, రూ.60 లక్షలు తన కొడుకు గిరీష్ కి ఇచ్చి మహబూబ్‌నగర్ పద్మావతి కాలనీలో ఉన్న ఇంటిని పెద్ద కూతురు రాజనందిని పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే అనారోగ్యానికి గురైన మాణిక్యరావు మంగళవారం

మిగతా 2 లో



# మమకారం మరిచి.. మానవత్వం మంటగలిపి!

మొదటి పేజీ తరువాయి

అర్ధరాత్రి మరణించారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాదులో ఉన్న గిరీష్‌కు తెలియజేశారు. "ఇంటిని నాకు కాకుండా చేశాడు.. నేను అంత్యక్రియలకు రాను" అని గిరీష్ చెప్పడంతో ఆ సోదరీమణులు.. 'అన్న ఆ ఇంటిని ముగ్గురం సమానంగా తీసుకుందాం.. నాన్న అంత్యక్రియలు నిర్వహిద్దాం రా' అంటే.. అతని గుండె కరగలేదు.. బంధువులు, మిత్రులు ఎంతగా చెప్పినా రాను అని తేల్చి చెప్పాడు. అంతకు ముందే అక్కడికి చేరుకున్న సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు 'మీరు అంత్యక్రియలు నిర్వహించకుంటే' మేము నిర్వహిస్తాం అని గట్టిగా చెప్పడంతో.. బంధువులు, మిత్రులు కుమారుడు రాకున్నా అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు. చిన్న కూతురు రఘు నందిని అంతిమ యాత్ర ముందు నడిచి.. తండ్రికి తలకొరివి పెట్టింది. తండ్రిపై మమకారం కన్నా.. ఆస్తికే ప్రాధాన్యతను ఇచ్చిన కొడుకు పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# పోలీసుల కృషికి దక్కిన గౌరవమిది

## ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025లో నిలవడం ఆనందంగా ఉంది: సీఎం



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** అత్యుత్తమ పనితీరుతో తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం ఆనందంగా ఉందని.. ఇది తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ చేస్తున్నకృషికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025' ప్రకారం, కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాలలో పోలీసింగ్ విషయంలో తెలంగాణ పోలీసు శాఖ మొదటి స్థానంలో నిలిచిందని.. టాటా ట్రస్ట్,సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్ వంటి ప్రఖ్యాత సంస్థలు రూపొందించిన ఈ నివేదికలో తెలంగాణకు గుర్తింపు దక్కడం రాష్ట్ర పోలీసుల కృషికి దక్కిన గౌరవమని, ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు కాపాడడం, నేరాలను నియంత్రించడం, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసుల నమోదులో పారదర్శకత చూపడం ద్వారా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతి, న్యాయం నిలబెట్టడంలో సఫలమయ్యారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి విజయాలను తెలంగాణ పోలీసులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# జపాన్ చేరుకున్న సీఎం రేవంత్

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** వారం రోజుల పర్యటన నిమిత్తం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం జపాన్ చేరుకుంది. అక్కడి భారత రాయబారి శింబు జార్జ్.. సీఎం, అధికారులకు ఆతిథ్య విందు ఇచ్చారు. టోక్యోలోని వందేళ్ల నాటి ఇండియా హౌజ్‌లో ఇచ్చిన విందులో సీఎం రేవంత్ బృందంతో పాటు- పలువురు తమిళనాడుకు చెందిన ఎంపీలు పాల్గొన్నారు. వివిధ అంశాలపై రాయబారి, తమిళ ఎంపీలతో సీఎం రేవంత్ చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. గురువారం టోక్యోలోని సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ.. జెట్రో, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్, వివిధ సంస్థలతో సమావేశం కానున్నారు. సాయంత్రం తొషిబా ఫ్యాక్టరీని రాష్ట్ర బృందం సందర్శించనుంది. ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి గురువారం జపాన్ చేరుకోనున్నారు.

# కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**మహబూబ్‌నగర్, నేటిప్రస్థానం:** బయట తిరుగుతూ ఫోన్ మాట్లాడుతున్నావంటూ పాఠశాల సిబ్బంది మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండలోని జరిగింది. కోయిల్‌కొండలోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఫోన్ మాట్లాడుతుండగా పాఠశాల సిబ్బంది మందలించారు. అయితే ఈ విద్యార్థి తనను ఇంటికి పంపిస్తారన్న భయంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించింది. ఇది గుర్తించిన సిబ్బంది విద్యార్థిని ఆస్పత్రికి తరలించారు.

# ఆధారాలు ఇవిగో.. చర్యలేందో చెప్పండి

- గ్రూప్-1లో అవకతవకలు జరిగాయి
- దేశంలోనే అతి పెద్ద స్కాం ఇదీ..
- 10 మంది అదనపు అభ్యర్థుల్లో ఎమ్మెల్సీ రాములు నాయక్ కోడలు ఉంది..
- ఉర్దూలో పరీక్ష రాసిన 9 మందిలో ఏడుగురికి ఉద్యోగాలు వచ్చాయి
- టీజీపీఎస్సీని నిలదీసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల



**కరీంనగర్, నేటి ప్రస్థానం:** టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగాయి. ఇది దేశంలోనే అతిపెద్ద స్కాం అని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆధారాలు ఇవిగో.. చర్యలు ఏం తీసుకుంటారో చెప్పాలని టీజీపీఎస్సీని డిమాండ్ చేశారు. వారు ఇంకా ఏమన్నారంటే వారి మాటల్లోనే.. 21,093 మంది గ్రూప్-1 పరీక్షలు రాస్తే 21,103 మంది రిజల్ట్ ఇచ్చారు. అయితే ఈ పది ఎక్కడి నుంచి వచ్చారు? ఉర్దూ మీడియంలో 9 మంది పరీక్ష రాశారని ఒకసారి, 10 రాశారని మరోసారి టీజీపీఎస్సీ రిపోర్ట్ ఇచ్చింది. ఇందులో ఏది నిజం.. ఏది అబద్ధం? ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్.. మెయిన్ మరో హాల్ టికెట్ ఇచ్చిన సందర్భం దేశ చరిత్రలో లేదు.. అది టీజీపీఎస్సీ చేతిలో ఉంటుందని సమర్థించుకుంటు న్నారు.. ఇక్కడే స్కాంకు ఆస్కారం ఏర్పడింది. ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన 654 మందికి సేమ్ మార్కులు ఎలా వచ్చాయి? కోఠిలోని ఓ సెంటర్‌లో పరీక్షలు రాసి న 1,497 మందిలో 75 మంది ఉద్యోగాలకు సెలె క్ట్ అ య్యారు.. మిగతా 25 సెంటర్లలో 10,135 మంది పరీ క్షలు రాస్తే 65 మందే సెలెక్ట్ అవుతారా? ఉర్దూలో పరీ క్షలు రాసిన 9 మందిలో 7 గురికి ఉద్యోగాలు వచ్చాయి.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోడలుకు మల్టీజోన్‌లో నంబర్ 1 ర్యాంకు, స్టేట్ లో 206 వ ర్యాంకు వచ్చింది. పరీక్ష రాసిన వారికంటే అదనంగా వచ్చిన 10 మందిలో రాములు నాయక్ కోడలు ఉన్నదని ఆరోపిస్తున్నాం.. సీఎం రేవంత్ రెడ్డి నుంచి పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నందున ఈ విషయమై బీజేపీ నాయకులు స్పందించడం లేదు. బీఆర్ఎస్ హయాంలో చిన్న చిన్న పరీక్షల పేపర్లు లీకైనాయని ఎగిరెగిరి దుంకిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఇపుడు ఇంత పెద్ద స్కాం జరిగినా ఎందుకు నోరు విప్పడం లేదు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒకటే.. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలి.. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్- 1 పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆధారాతో సహా బయట పెట్టాం.. దీనిపై విచారణ జరిపించి కాంగ్రెస్ నాయకులు తమ నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్స్ భూతాన్ని తరుమాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**నేటిప్రస్థానం, సూర్యాపేట:** యువతను పట్టి పీడిస్తున్నడ్రగ్స్ భూతాన్ని జిల్లా నుంచి తరిమివేసేందుకు అధికారులు కంకణబద్ధులు కావాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంచి భవిష్యత్ ఉన్న యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో నార్కోటిక్ కో ఆర్డినేషన్ సెంటర్ (యన్‌సీ ఓఆర్‌డీ-ఎన్ కార్డు)పై ఎస్పీ నరసింహ, ఇతర అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థలు అధికంగా ఉన్న సూర్యాపేట, కోదాడలో విద్యార్థులకు డ్రగ్స్ వాడకంపై కలిగే దుష్పలితాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనుమానిత ప్రదేశాల్లో సీసీ కెమెరాల నిఘా పెంచాలని, లైట్స్, పెట్రోలింగ్ క్రమం తప్పకుండా జరపాలని పేర్కొన్నారు. జిల్లాలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిచామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలకు విస్తరిస్తున్న డ్రగ్స్: ఎస్పీ నర్సింహ 2024 లో 139 మందిని, 2025 లో 23 మందిని గంజాయి తరలిస్తుండగా అరెస్ట్ చేశామని ఎస్పీ నర్సింహ తెలిపారు. గంజాయి మహమ్మారీ నేడు గ్రామాలకి విస్తరించిందని, గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చిన్నారులకు చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలు అలవాటు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రహరీ క్లబ్స్, యాంటీ డ్రగ్స్ కమిటీలు డ్రగ్స్ నిర్మూలనకు తమవంతు ప్రయత్నం చేయాలన్నారు. జిల్లా అధికారులంతా ప్రతి బుధవారం డ్రగ్స్ నివారణకు సంబంధించిన పోస్టర్లను స్టేటస్, డీపీలుగా పెట్టుకోవాలని తెలిపారు. అనంతరం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ భిక్షపతి రావు, డీటీఓ సురేశ్‌కుమార్, డీఈఓ అశోక్, డీఐఈ ఓ భాను నాయక్, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ సురేందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# భారీగా పెరిగిన బంగారం ధరలు

**నేటిప్రస్థానం, న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా చోటు-చేసుకుంటు-న్న వాణిజ్య మార్పులు భారత మార్కెట్‌పై భారీ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం 24 క్యారెట్ల బంగారం ధరలు రూ.1,650 పెరిగి 10 గ్రాములకు రూ.98,100కు చేరాయి. ఇదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా రూ.1,650 పెరిగి రూ.97,650 స్థాయికి చేరుకుంది. ఈ ధరలు ప్రస్తుతం ఆల్ -టైం గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య సంబంధాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అనేక మంది కూడా సురక్షితమైన బంగారం పెట్టు-బడులపైన ఫోకస్ చేస్తున్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

## అదనపు కలెక్టర్ పి. రాంబాబు..



**నేటిప్రస్థానం, సూర్యపేట:** ప్రభుత్వ సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. మునగాల మండలం కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్ ను, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోజనం ఎలా ఉంటుందని అడిగారు. అనంతరం ఆయనమాట్లాడుతూ హాస్టల్స్ లోని బాలికలకు అన్ని వసతులు కల్పిచాలని , ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని, వంట గదిని పరిశుభ్రముగా ఉంచుకోవాలని, కూరగాయలు, పాలు ఎప్పుడు తాజాగా ఉండే విధముగా చూసుకోవాలని తెలిపారు. సరుకులు, కూరగాయలు వెలుతురూ తగిలే ప్రదేశంలో నిలువ చేసుకోవాలని, మరుగు దొడ్లు పరిశుభ్రముగా ఉంచడంతో పాటు వాటికీ తలుపులు ఉండే విధముగా చూసుకోవలని అన్నారు. అక్కడ నుంచి నేరుగా స్థానికంగా ఏర్పాటు చేసిన ఐ కే పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నిత్యం రైతులు సెంటర్‌కు తీసుకువస్తున్న ధాన్యం వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని,వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టుగా కాంటావేసి ధాన్యమును మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.ఆయన వెంట తహసిల్దార్ ఆంజనేయులు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు.

# రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదు

## సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వీణారెడ్డి

**సూర్యాపేట, నేటి ప్రస్థానం:** దళారులు రైతులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేదే లేదని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వీణారెడ్డి హెచ్చరించారు. సూర్యపేట లోని తన నివాసంలో బుధవారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నేరుగా తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. దళారులు చెబుతున్న కల్లి బొల్లి మాటలకు రైతులు మోసపోవద్దని తెలిపారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలుకు ఏర్పాటు జరిగాయని వివరించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనకు చెప్పవచ్చని పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో భీమిడి వెంకటరెడ్డి, రాంరెడ్డి,,జైపాల్ రెడ్డి, మాధవరెడ్డి, మహిపాల్ రెడ్డి ఉన్నారు.



# ఎడారి మరణశాసనం

ఉన్న ఊర్లో బతుకు లేకనో, అప్పులు తీర్చేందుకో, బతుకుదెరువుకో గల్ఫ్ బాట పడుతున్న తెలంగాణ వాసులు విగత జీవులుగా మారి ఇంటికొస్తున్నారు. ఒక్కసారి దుబాయ్ వెళ్తే బతుకు బాగుపడుతుందని ఆశల పల్లకిలో ఊరేగుతూ విమానమెక్కుతున్న వారు శవాలుగా మారి కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. దుబాయ్ షేక్‌ల వేధింపులు, ఏజెంట్లను నమ్మి దేశం కాని దేశంలో అవస్థల పాలవుతున్న వారు కొందరైతే, చిన్న తప్పుకే అక్కడి కారాగారంలో మగ్గుతూ కుటుంబాలకు దూరమవుతున్న ఎందరో. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వారు ఇంకొందరు. హత్యలకు గురవుతున్న వారు మరికొందరు. తాజాగా ఇద్దరు తెలంగాణ వ్యక్తులు దుబాయ్‌లో పాకిస్థానీ చేతిలో హత్యకు గురికావడం ఆందోళనకు గురిచేస్తోంది.

- హైదరాబాద్ ప్రధాన ప్రతినిధి, నేటి ప్రస్థానం

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.2,520 కోట్లు..

గల్ఫ్‌లోని ఒక కార్మికుడు, నెలకు కనీసం 700 యూఏఈ దిర్హామ్స్ / సౌదీ రియాల్స్ లేదా సమానమైన గల్ఫ్ కరెన్సీలు పంపితే అది రూ.14వేలకు సమానం. 15 లక్షల మంది గల్ఫ్ ప్రవాసులు నెలకు రూ.14 వేలు పంపిస్తే రూ.2,100 కోట్లు అవుతుంది. సంవత్సరానికి రూ.25,200 కోట్లు. తెలంగాణ గల్ఫ్ ప్రవాసులు పంపే రూ.25,200 కోట్లు విదేశీ మారక ద్రవ్యం వారి కుటుంబ సభ్యుల ద్వారా దేశీయంగా వినియోగంలోకి వచ్చినప్పుడు కనీసం 10 శాతం జీఎస్టీతో సంవత్సరానికి రూ.2,520 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది. ఇందులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన సగం వాటా కింద సంవత్సరానికి రూ.1,260 కోట్లు లాభపడుతున్నది. 'బొగ్గుబాయి-బొంబాయి-దుబాయి' అనే నినాదంతో ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన ఉద్యమంలో గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబాలు ముందున్నాయి. తెలంగాణ ఏర్పడిన గత పదేళ్లలో తెలంగాణకు చెందిన 1,800కి పైగా కార్మికులు గల్ఫ్ దేశాల్లో మృతి చెందారు. 2014 కంటే ముందు కూడా వేలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాలలో అమరులయ్యారు.












## పాకిస్థానీ చేతిలో ఇద్దరు హత్య..



తాజాగా దుబాయ్‌లోని అల్‌క్యూజ్ ప్రాంతంలో మోడర్న్ బేకరీలో పనిచేస్తున్న ఇద్దరు తెలంగాణ వ్యక్తులు దారుణ హత్యకు గురికావడం సంచలనమైంది. వీరితో పాటే పనిచేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తి వీరిని కత్తితో విచక్షణ రహితంగా పొడిచి చంపాడు. నిర్మల్ జిల్లాకు చెందిన అష్టపు ప్రేమ్ సాగర్ (40), జగిత్యాల జిల్లాకు చెందిన శ్రీనివాస్ పాకిస్థానీ దాడిలో మరణించగా, నిజామాబాద్ జిల్లా ఆర్మూరుకు చెందిన దేగాం సాగర్ గాయపడ్డాడు. సాగర్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందతుతున్నాడు. నిర్మల్ జిల్లా సోన్ మండలానికి చెందిన ప్రేమ్ సాగర్ 20 ఏళ్లుగా గల్ఫ్‌లో పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం దుబాయ్‌లోని మోడర్న్ బేకరీలో యంత్రం ఆపరేట్ చేసే పనిలో చేరాడు. అతడి తల్లి లక్ష్మి, భార్య ప్రమీల (35), కూతులు విజ్ఞశ్రీ (9), సహస్ర (2) ఉన్నారు. పది రోజుల క్రితమే ఆయన నానమ్మ ముత్తమ్మ (9) చనిపోయింది. ఆమె పెద్దకర్మ రోజే ప్రేమ్ సాగర్ హత్యకు గురయ్యాడు. చిన్న కూతురు సహస్ర తల్లి కడుపులో ఉన్నప్పుడే దుబాయ్ వెళ్లాడు. తాను పుట్టిన్పటి నుంచి గ్రామానికి రాలేదు. బిడ్డను చూడకుండానే తనువు చాలించాడు. ఇక, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ (42)కు భార్య మంజుల, ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. తెలంగాణ వ్యక్తుల హత్యపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విదేశాంగశాఖకు లేఖ రాశారు. వీలైనంత త్వరగా మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంలో సహకరించాలని కోరారు.

- గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణ వాసులు
- తెలంగాణ ఏర్పాటు తర్వాత 1700 మందికిపైగా మృతి
- ప్రతి రెండు రోజులకు ఒకరు మృత్యువాత
- హామీలే తప్ప పట్టించుకోని ప్రభుత్వాలు
- గల్ఫ జైళ్లలో మగ్గుతున్న వందలాదిమంది
- తాజాగా పాకిస్థానీ చేతిలో ఇద్దరు దారుణ హత్య
- ఒంటరవుతున్న కుటుంబాలు.. చివరి చూపు కోసం పడిగాపులు

విదేశాంగశాఖ లెక్కల ప్రకారం గల్ఫ్ దేశాల్లో 89 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో తెలంగాణకు చెందిన కార్మికుల సంఖ్య 15 లక్షల పైమాటే. వారిలో 10 లక్షల మంది ఉత్తర తెలంగాణకు చెందిన వారు కావడం గమనార్హం. మిగిలిన వారిలో హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 1700 మందికిపైనే మరణించారు. శంషాబాద్ విమానాశ్రయంలో మృతదేహాలను తరలించేందుకు తీసుకొనే ఎన్‌వోసీ లెక్కల ఆధారంగా ఈ అంచనాకు వచ్చారు. ఈ లెక్కన చూసుకుంటే ఏడాదికి 200 మంది గల్ఫ్ దేశాల్లో చనిపోతున్నారు. అంటే ప్రతి రెండు రోజులకు ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారన్నమాట.



### గుండెపోటుతోనే ఎక్కువమంది

బతుకుదెరువు కోసం వేల కిలోమీటర్లు వలస వెళ్లిన కార్మికుల్లో 80 శాతం మంది గుండెపోటుతోనే మరణించడం విషాదం. వీరంతా 35 నుంచి 50 ఏళ్లలోపు వారే. ఉన్న ఊరును, కన్నవారిని వదిలి వెళ్తున్న వీరంతా మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురవుతూ గుండెపోటుకు గురవుతున్నారు. అక్కడ వేతనాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, అప్పుల భారంతో ఇంటికి వెళ్లడానికి మనసు రాక, అలాగని అక్కడ పనిచేయలేక, కుంగిపోయి చనిపోతున్నారు.

### ఎవరూ ఆదుకోవడం లేదు

గల్ఫ్‌లో చనిపోతున్న వారిని అక్కడి కంపెనీలతోపాటు మన ప్రభుత్వాలు కూడా ఆదుకోవడం లేదు. ప్రవాసి భారతీయ బీమా యోజనకు రూ. 325 ప్రీమియం కడితే రూ. 10 లక్షలు వస్తుంది. దీనిని ఈసీఎన్‌ఆర్(ఇమిగ్రేషన్ క్లియరెన్స్ రిక్వైర్డ్), నాన్ ఈసీఎన్‌ఆర్‌కు సంబంధం లేకుండా గల్ఫ్‌లో కార్మికుల సహజ మరణాలకు కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని గల్ఫ్‌లోని తెలుగు సంఘాలు కోరుతున్నాయి.

### దశాబ్దాలుగా సమస్య

గల్ఫ్ బాధితుల సమస్య ఇప్పటికిప్పుడు వచ్చింది కాదు. దశాబ్దాలుగా ప్రవాస తెలుగు కార్మికులు గల్ఫ్‌లో అడుగడుగునా మోసాలకు గురవుతూ నానా అవస్థలు పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఇందుకు అవసరమైన నిధులు



కేటాయించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు అది చేస్తాం, ఇది చేస్తాం అని హామీ ఇచ్చే నేతలు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని గల్ఫ్ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు

గల్ఫ్ దేశాలకు వెళ్లే తెలంగాణ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చింది. అరబ్ దేశాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందించనున్నట్టు ప్రకటించింది. అయితే, బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాలో మరణించి తెలంగాణ కార్మికుల కుటుంబాలకు మాత్రమే ఈ పరిహారం ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. తమ వారిని కోల్పోయిన కార్మికుల కుటుంబ సభ్యులు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆరు నెలల్లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

### గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న భారత కార్మికులు..

ప్రపంచవ్యాప్తంగా 82 దేశాల్లో 8,343 మంది భారతీయులు జైళ్లలో మగ్గుతున్నారు. వారిలో అత్యధికంగా 4,755 మంది ఆరు గల్ఫ్ దేశాల్లోనే ఉన్నారని కేంద్ర విదేశాంగ శాఖ స్వయంగా ప్రకటించింది. తెలంగాణకు చెందిన 500 మందికిపైగా వలస కార్మికులు గల్ఫ్ దేశాల్లోని జైళ్లు, డిపోర్టేషన్ కేంద్రాల్లో మగ్గిపోతున్నారు. మలేషియా జైళ్లలో 606 మంది, యూఏఈలో 1,926 మంది, సౌదీ అరేబియాలో 1,362 మంది, ఖతార్‌లో 682 మంది, కువైట్‌లో 428 మంది, బహ్రెయిన్‌లో 265 మంది, ఒమన్‌లో 92 మంది భారతీయ ఖైదీలు ఉన్నారు.



నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక
APTEL/2013/54506
హైదరాబాద్
హైదరాబాద్
గురువారం
17.04.2025


# దేశాన్ని లూటీ చేసిన నెహ్రూ కుటుంబం

**దేశాన్ని అవినీతమయంగా చేశారు**

**కాంగ్రెస్ హయాంలోనే నేషనల్ హెరాల్డ్ కేసు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు**



**నేటి ప్రస్థానం, న్యూఢిల్లీ:** నెహ్రూ కుటుంబం దేశాన్ని లూటీ చేసిందని.. అంతేకానీ.. దేశానికి ఆ కుటుంబం ఏం చేయలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఆ క్రమంలో దేశాన్ని అవినీతిమయంగా మార్చిన విషయం మనం చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నేషనల్ హెరాల్డ్ కేసు వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీతోపాటు- ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై మంత్రి జి.కిషన్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో బొగ్గు, హెలికాప్టర్, బోఫోర్స్ కుంభకోణాలు లాంటివి ఎన్నో జరిగాయన్నారు. ఆ క్రమంలో జరిగిన మరో పెద్ద కుంభకోణమే నేషనల్ హెరాల్డ్ అని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమ-రయోధులు నేషనల్ హెరాల్డ్ స్థాపిస్తే.. దానిని దొడ్డి దారిన సోనియా, రాహుల్ గాంధీలకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీకి తరలించారని విమర్శించారు. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడం సిగ్గు మాలిన చర్య అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. 2012లో నేషనల్ హెరాల్డ్ ఆస్తులపై దర్యాప్తు జరపాలంటూ సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారన్నారు. అందులోభాగంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఆయన కేసు వేశారని తెలిపారు . అయినా.. కాంగ్రెస్ పార్టీ ఎందుకు ధర్నాలు చేస్తుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వీరికి భయపడి కేసులు వెనక్కి తీసుకోవాలా? అని పార్టీని సూటిగా ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం దర్యాప్తు జరపాలని చెప్పిందని గుర్తు చేశారు. చేసిన తప్పులకు చెంపలు వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఆయన సూచించారు. ప్రజలను తప్పుదారి పట్టించడంతోపాటు ఈడి కార్యాలయాల ముందు ధర్నా చేయడం మానుకోవాలని వారికి హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుంభకోణాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని, సుప్రీంకోర్టు, హైకోర్టును తప్పుపట్టడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కేసులు ఎందుకు వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఆయన డిమాండ్ చేశారు. చట్టానికి వీరేమైనా చుట్టాలా అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఎందుకు ధర్నా చేస్తున్నారంటూ మండిపడ్డారు. తప్పు జరగలేదని కాంగ్రెస్ పార్టీ భూకయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసు కొట్టేయాలంటూ సుప్రీంకోర్టు,హైకోర్టు ఎందుకు వెళ్ళారని ఆయన ప్రశ్నించారు. ఇలా వెళ్లడం రాజ్యాంగబద్ధమైన సంస్థలను అవహేళన చేయడమేనని పేర్కొన్నారు. సోనియా, రాహుల్ గాంధీలు దేశం కోసం చేసిన పనులు కావన్నారు. వీరు బహిరంగ అవినీతికి పాల్పడ్డారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను ఛార్జిషీట్‌లో ఈడీ పెట్టింది. ఈ కేసును ఏప్రిల్ 25వ తేదీన విచారణ జరపనున్నట్లు- ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. అయితే ఇదే కేసులో ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటలకే సోనియా, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జిషీట్‌లో ఈడీ చేర్చడం గమనార్హం.

# పాఠశాల వంటగదిలో విష ప్రయోగం

**30 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు**

**నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వెల్లడి**





**నేటి ప్రస్థానం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విష ప్రయోగం జరిగింది. విద్యార్థులు తాగే నీటి ట్యాంక్‌లో దుండగులు పురుగుల మందు కలిపారు. మధ్యాహ్న భోజన సామగ్రిపై కూడా పురుగుల మందులు చల్లారు. బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో పాఠశాలలోని వంట గదికి సిబ్బంది తాళాలు వేసుకుని వెళ్లారు. సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన సిబ్బంది వంట చేసేందుకు పాత్రలు కడిగే సమయంలో దుర్వాసన, నురగలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పాఠశాల హెడ్ మాస్టర్, సిబ్బంది చుట్టుపక్కల చూడగా పురుగుల మందు డబ్బా కనిపించింది. అలాగే తాగు నీటి ట్యాంక్‌లోనూ పురుగుల మందు కలిపినట్లు-గా సిబ్బంది గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది.. విద్యార్థులను తాగునీటి కుళాయిల వైపు వెళ్లకుండా చూశారు. మధ్యాహ్న భోజనం వండలేదు. ఈ ఘటనపై ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సరైన సమయానికి పాఠశాల సిబ్బంది గుర్తించి మధ్యాహ్న భోజనం వండకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ధర్మపురి పాఠశాలలో దాదాపు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా విష ప్రయోగం నుంచి బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఈ ఘటనపై పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు మండిపడుతున్నారు. అసలు స్కూల్ పిల్లలపై విష ప్రయోగం చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని.. చిన్న పిల్లలు ఏం పాపం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చోడలోని ప్రభుత్వ పాఠశాల వంట గదిలోని నీటిలో పురుగుల మందు కలిపిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల కారణంగానే నిందితుడు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఈ నెల 13, 14వ తేదీల్లో సెలవు కావడంతో ఇచ్చోడ మండలం ధర్మపురి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మూసివేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసేసరికి స్కూల్ వంటగదికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని అక్కడి ఉపాధ్యాయురాలు, సిబ్బంది గమనించారు. వంటగదిలో ఉన్న ఒక బకెట్‌లో నీరు తెలుపు రంగులో ఉండటాన్ని వారు గమనించారు. అక్కడి పాత్రలను చూసి అనుమానం వచ్చిన టీచర్ ప్రతిభ.. వెంటనే గ్రామ సర్పంచి, స్థానిక పెద్దలకు సమాచారం ఇచ్చారు. వారు పాఠశాలకు వచ్చి పరిశీలించగా.. నీటిలో పురుగుల మందు కలిపినట్లు గుర్తించారు. ఉపాధ్యాయురాలు ప్రతిభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేశ్ పాఠశాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ధర్మపురికి చెందిన వ్యక్తిపై అనుమానంతో ఆ దిశగా దర్యాప్తు చేశారు. ధర్మపురి గ్రామానికి చెందిన సోయం కిస్టును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. తానే పురుగుల మందు కలిపినట్లు- అంగీకరించాడు. నిర్మల్‌లో ఉన్న తన సోదరుడి ఇంటి నుంచి పురుగుల మందు తీసుకొచ్చి.. పాఠశాల వంట గది తాళాన్ని పగలగొట్టి నీటిలో కలిపినట్లు అంగీకరించాడు. కుటుంబ కలహాల కారణంగా గత కొంతకాలంగా నిందితుడు మానసికంగా ఇబ్బందిపడుతున్నట్లు దర్యాప్తులో గుర్తించాం. తన ఇంట్లో వారిపై ఉన్న కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేశాం. అని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటన వల్ల పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగలేదని ఎస్పీ తెలిపారు.

# నేటినుంచి భూభారతి అవగాహన సదస్సులు

**నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు**

**ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రారంభించనున్న పొంగులేటి**



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణ భూ భారతి గురువారం నుంచి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న భూభారతి పైలట్ ప్రాజెక్టు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించనున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డిలోని లింగంపేట, నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపురంలో భూ భారతి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మద్దూర్ మండలం ఖాజీపురంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. అలాగే.. వికారాబాద్ జిల్లా పుడూరు గ్రామంలో జరిగే భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ అధికారులు పాల్గొననున్నారు. ఏప్రిల్ 17 నుంచి జూన్ 2 వరకు భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులు నిర్వహించనుంది ప్రభుత్వం.

# గచ్చిబౌలి భూములపై వీడియో షేర్

**సీనియర్ అధికారి స్మితాకు పోలీసుల నోటీసులు**






**హైదరాబాద్,ఏప్రిల్16 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్మితా సబర్వాల్‌కి రాష్ట్ర పోలీసుల నుంచి నోటీసు అందింది. దీనికి కారణం స్మితా సబర్వాల్ సామాజిక మాధ్యమాల్లో కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల అడవి ధ్వంసానికి సంబంధించిన ఓ ఏఐ రూపొందించిన చిత్రం షేర్ చేయడమే. ఈ చిత్రం మార్చి 31న 'సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి షేర్ చేయబడింది. ఇది మష్రూమ్ రాక్ వద్ద బుల్‌డోజర్లు, వాటిని చూస్తున్న నెమలి, జింక లాంటి జంతువులతో జిబ్లి స్టైల్‌లో రూపొందించబడినదిగా ఉంది. హైదరాబాద్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని చిత్రంలో చూపించారు. ఈ విషయమై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ.. భారతీయ నాగరిక సురక్షా సంహిత లోని సెక్షన్ 179 ప్రకారం స్మితా సబర్వాల్‌కు నోటీసు జారీ చేసినట్లు- తెలిపారు. అయితే, నోటీసులో పేర్కొన్న విషయాలను ఇప్పుడే బయటపెట్టలేమని స్పష్టం చేశారు. సెక్షన్ 179 ప్రకారం కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి, సంబంధిత వ్యక్తులను స్టేట్‌మెంట్ ఇవ్వాలంటూ స్టేషన్‌కు హాజరయ్యేలా పిలిచే అధికారం కలిగి ఉంటాడు. ఈ నిబంధనల ఆధారంగానే స్మితాకు నోటీసు పంపినట్లు- తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రజా చైతన్యాన్ని కలిగించే భాగంలో ఉన్న ఒక అధికారికి నోటీసు రావడం పట్ల అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏఐ చిత్రాన్ని షేర్ చేయడం వల్ల నేరపూరిత చర్యలకు దిగడమేంటన్న ప్రశ్నలు కూడా తెరపైకి వచ్చాయి.



# అక్రమ వలసదారులకు ట్రంప్ బంపర్ ఆఫర్

**స్వీయ బహిష్కరణ పథకం అందచేస్తామని ప్రకటన**

**విమాన ఖర్చులతో పాటు, దారి బత్తెం ఇస్తామని వెల్లడి**

**వాషింగ్టన్:** అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు ఇన్నాళ్లూ కఠిన నిబంధనలు అమలు చేస్తూ వచ్చిన అమెరికా ప్రభుత్వం.. తాజాగా వారికి ఓ బంపర్‌ఆఫర్ ఇచ్చింది. ఎవరైతే స్వచ్ఛందంగా అమెరికా వీడి తమ స్వదేశానికి వెళ్లిపోతారో.. వారికి విమాన టికెట్లతో పాటూ కొంత ఆర్థిక సాయం కూడా చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అమెరికా నుంచి బయటికి పంపించడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. అమెరికాలోని వలసదారులపై డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ దేశం విడిచివెళ్లేవారికి విమాన ఛార్జీలు, స్టైఫండ్‌ను అందిస్తున్నట్లు- చెప్పారు. ఈ సందర్భంగా యాంకర్ ట్రంప్‌కు ఓ వీడియో చూపించారు. ఓ వ్యక్తి 20 ఏళ్ల క్రితం చట్టవిరుద్ధంగా అమెరికాకు వచ్చాడని, ప్రస్తుతం అతికి పిల్లలు కూడా ఉన్నారని ఆ వీడియో సారాంశం. తాను ఓటు వేయలేకపోయినా, తాను ట్రంప్‌కు మద్దతు ఇచ్చేవాడినని ఆ వ్యక్తి తెలిపారు. ఈ వీడియో చూసిన ట్రంప్.. ఇలాంటి వ్యక్తిని తమ దేశంలో ఉంచుకోవాలని అనుకున్నట్లు చెప్పారు. ఇలాంటి వారి వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని కూడా చెప్పారు. వలసదారులను దేశం నుంచి పంపించడమే తమ ప్రథమ లక్ష్యమని, అయితే వారు ఉండడానికి అర్హులని తేలితే.. తిరిగి వెనక్కి తీసుకురావడానికి కూడా అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. స్వీయ బహిష్కరణకు తుది ఉత్తర్వులు పొంది కూడా 30 రోజులు దాటి అమెరికాలో నివసిస్తున్న వారికి రోజుకు 998 డాలర్లు జరిమానాగా విధిస్తామని అమెరికా ప్రభుత్వం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్వీయ బహిష్కరణ వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. స్వతహాగా దేశాన్ని విడిచిపెట్టి వెళ్లడం వెళ్లాలనేకునే వారికి సాయం అందిస్తామని చెప్పారు. తమ దేశాలకు వెళ్లే క్రమంలో చార్జీలను భరించలేకపోతే.. సబ్సిడీ విమాన సర్వీసుకు కూడా అర్హులవుతారని అధికారులు పేర్కొన్నారు.

# జేడీ వాన్స్ భారత్ పర్యటన ఖరారు

**18 నుంచి 24 వరకు సతీసమేతంగా పర్యటన**

**నేటి ప్రస్థానం, న్యూఢిల్లీ:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటన ఖరారైంది. సతీమణి ఉషా వాన్స్‌తో కలిసి ఇటలీ, భారత్‌లను సందర్శించనున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం ఈమే-రకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం జేడీ వాన్స్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఆయన సతీమణి ఉష తెలుగమ్మాయి అనే విషయం తెలిసిందే. ఇటలీ, భారత్ పర్యటనల్లో భాగంగా ఆయా దేశాల నేతలతో వాణిజ్య, భౌ గోళిక రాజకీయ అంశాలపై జేడీ వాన్స్ చర్చలు జరుపుతారని అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. భారత పర్యటనలో భాగంగా వాన్స్ కుటు-ంబం దిల్లీ, జైపూర్, ఆగ్రాలను సందర్శించనుంది. ఆయా చారిత్రక ప్రదేశాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననుంది. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీతో జేడీ వాన్స్ భేటీ- కానున్నారు. భారత్- అమెరికా వాణిజ్య చర్చల వేళ ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1970ల్లోనే అమెరికాకు వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. యేల్ లా స్కూల్‌లో ఉషా, జేడీ వాన్స్ తొలిసారి కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడి.. 2014లో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భర్త విజయంలో ఉష కీలక పాత్ర పోషించారు. అమెరికా సెకండ్ లేడీ హోదాలో తన పూర్వీకుల దేశానికి రావడం ఆమెకు ఇదే తొలిసారి.

# 15మందితో గద్దర్ అవార్డుల జ్యూరీ కమిటీ

**ఛైర్‌పర్సన్‌గా జయసుధ నియామకం**



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలుగు సినిమా రంగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా నటి జయసుధను ఎంపిక చేశారు. నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నిర్ణయం కూడా తీసుకుంది. ఈ క్రమంలో 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ఈ నెల 21 నుంచి జ్యూరీ పరిశీలించనుంది. జయసుధ, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్‌లతో సమావేశమైన ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కోరారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను ఇస్తున్నట్టు గుర్తుచేసిన దిల్ రాజు.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డులకు ఇంతటి స్పందన రాలేదన్నారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల కోసం అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లురాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు వెల్లడించారు.